ప్రతిపక్షాల కుట్రలను ప్రజలకు వివరించండి

- ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి
- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- కన్వీనర్లు, గృహసారథులకు దిశానిర్దేశం



భీమవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



సమావేశంలో పాల్గొన్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

సాక్షి, భీమవరం: ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్‌కు అధికారం ఖాయమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం ఏఎంసీ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

హామీలను విస్మరించిన చంద్రబాబు

2014 ఎన్నికల్లో ప్రజలకు 600 హామీలను ఇచ్చి మోసం చేసిన చంద్రబాబును ఆనాడు పవన్ కల్యాణ్ ప్రశ్నించలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు ఇరుకు సందుల్లో బహిరంగ సభలను ఏర్పాటు చేసి దాదాపుగా పదిమంది వరకు చనిపోవడానికి కారణమైనప్పుడు కూడా పవన్ ఆయనను ప్రశ్నించకపోవడం వెనుక ఉన్న అర్థం ఏమిటని ఆయన అన్నారు. కనీసం బాధిత కుటుంబాలను పవన్ పరామర్శించ లేదని, చంద్రబాబుకు సంఘీభావంగా ఆయనను కలుసుకోవడం చూస్తుంటే రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై ఎన్ని కుట్రలు చేస్తున్నారో ప్రజలు గుర్తిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కన్వీనర్లు, గృహ సారథులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎల్లో మీడియా కుట్రలను అందరికీ తెలియజేయాలని ఆయన కోరారు.

గృహసారథులు పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోని విస్తృతంగా తీసుకువెళ్లే బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లదేనని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన భీమవరం పట్టణ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహసారథులపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకుని రాజకీయ ఎదుగుదలకు ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా మూడున్నరేళ్లలో అమలు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. 2014లో ఎన్నికల్లో టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని విస్మరించి, రైతులు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులను మోసగించారని విమర్శించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి వెళ్లి వారికి జగన్ ప్రభుత్వంలో చేకూరిన మేలును చంద్రబాబు చేసిన మోసాన్ని వివరించాలన్నారు. కొన్ని మీడియా సంస్థలు దుష్టపన్నాగంతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న విషయాన్ని గృహసారథులు ప్రజలకు వివరిస్తూ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న అంశాన్ని ఇంటింటికీ వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, వన్ టౌన్ జేసీఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, సాలా అశోక్ కుమార్, గంటా సుందర్ కుమార్, యర్రంశెట్టి కొండ, ముద్దల కరుణ్ కుమార్, కట్రెడ్డి వెంకటేశ్వరరావు, సాధనాల బాలస్వామి, కొప్పుల రంగారావు, కోసిరెడ్డి బాలాజీ, చిగురుపాటి రాజు, లక్కు త్రిమూర్తులు, పోతుల జకరయ్య, కడియం ప్రసాద్, గ్రంధి నీలిమ, అల్లబోయిన శాంతి, నాయుడు దుర్గ, కట్రెడ్డి సీతారామయ్య, సభిత ఎలిజిబెత్ రాణి, పోతుల నిరూపా, కొండేటి సుధాకర్, కరుకు ఏడుకొండలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రైవర్ పోస్టుల భర్తీకి 17న ఇంటర్వ్యూలు

కాళ్ల: డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల ఆధ్వర్యంలో ఈఎంఆర్ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ పరిధిలో డ్రైవర్ పోస్టుల భర్తీకి ఈనెల 17న శుక్రవారం భీమవరం వెటర్నరీ హాస్పిటల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాల జిల్లా మేనేజర్ శివతేజ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళ్ల, ఉండి, భీమవరం ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఉంటుందని, 35 సంవత్సరాలలోపు వయసు ఉండి ఎస్ఎస్సీ పాసై, డ్రైవింగ్‌లో 2 నుంచి 3 సంవత్సరాల అనుభవం గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 91105 95889లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి చెరుకువాడలో సువార్త సభలు

ఉండి: ఉండి మండలం చెరుకువాడ చిన పేటలో 16వ నుంచి 18వ తేదీ వరకు సీబీసీఎన్‌సీ చర్చ్ ఆధ్వర్యంలో ఉజ్జీవ సువార్త మహాసభలు నిర్వహిస్తున్నట్టు పాస్టర్ రెవరెండ్ ఎస్ జార్జిముల్లర్, సీఆర్ శామ్యూల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రదర్ మేడిద జాన్సన్, బ్రదర్ పి.జేమ్స్, బ్రదర్ సీహెచ్ సంతోష్‌రెడ్డి వాక్యోదేశం చేస్తారని పేర్కొన్నారు. నిత్యం సాయంత్రం 6:30 గంటలకు సభలు ప్రారంభమవుతాయని, విశ్వాసులంతా హాజరుకావాలని జార్జిముల్లర్ కోరారు.

పెనూయేలు సువార్త సభలు ప్రారంభం



సువార్త సభల ప్రారంభ సూచికగా బెలూన్స్ వదులుతున్న జాన్సన్

ఉండి: స్థానిక పెనూయేలు ప్రార్థనామందిరం ఆధ్వర్యంలో పాస్టర్ ఈదా విజయ్‌ప్రసాద్ ఏర్పాటు చేసిన 18వ వార్షిక సువార్త మహాసభలను వైఎస్సార్‌సీపీ క్రిష్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్రాధ్యక్షుడు మేడిద జాన్సన్ బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విశ్వాసీ కులమతాలకు అతీతంగా అందరినీ ప్రేమించి, గౌరవించాలని సూచించారు. అంతర్జాతీయ ప్రసంగీకులు బ్రదర్ అనిల్‌కుమార్ ఈ సభల్లో పాల్గొంటున్నట్టు చెప్పారు. పాస్టర్ ఎం.జ్యోతిరాజు వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కతమం సౌజన్య.కమతం బెనర్జీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరావు, సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు (హెడ్), పాస్టర్స్ డేవిడ్, జాన్‌మోజెస్, ఎస్ఎం బందా, విశ్వాసులు పాల్గొన్నారు.

కొమరాడలో ఆక్సిజన్ ఫిల్లింగ్ యూనిట్ ప్రారంభం



కొమరాడలో ఆక్సిజన్ ఫిల్లింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని కొమరాడలో బుధవారం ఆల్ఫా ఆక్సిజన్ ఫిల్లింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమవరానికి సమీప గ్రామంలో ఆక్సిజన్ ఫిల్లింగ్ యూనిట్ ఏర్పాటు చేసి మెడికల్, ఇండస్ట్రీయల్ ఆక్సిజన్, నైట్రస్ ఆక్సైడ్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని నిర్వాహకులు గుద్దటి సురేంద్ర నాయుడుని అభినందించారు. సర్పంచ్ రాట్నాల రామకృష్ణ స్వామి, తోట భోగయ్య పాల్గొన్నారు.

పుస్తకాలు విజ్ఞానాన్ని అందిస్తాయి



భీమవరంలో వైఎస్సార్ శాఖా గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న ఆర్డీఓ రాజు తదితరులు

సాక్షి, భీమవరం: విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని అందించేవి పుస్తకాలేనని భీమవరం ఆర్డీవో దాసి రాజు అన్నారు. అరసవల్లి ఈశ్వరమ్మ- వీర వెంకటచారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ శాఖా గ్రంథాలయానికి బుధవారం రూ. 40 వేలు విలువ చేసే పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఉచితంగా అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రంథాలయానికి అందించిన పుస్తకాలు నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎంసెట్, ఇంజనీరింగ్, గ్రూపు వన్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉంచామన్నారు. పబ్లిక్ సర్వీసు కమిషన్, రైల్వే సర్వీసు వంటి ఉద్యోగాలకు సంబంధించి అవసరమైన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని రాజు కోరారు. అనంతరం ఆర్డీవో రాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం, అల్లూరి సాయి దుర్గారాజు, చెరుకువాడ వెంకట్రామయ్య, అల్లు శ్రీనివాస్, వారణాసి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా



విస్సాకోడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళాలో భాగంగా విస్సాకోడేరులో బుధవారం యూనివర్సల్ హెల్త్ డే నిర్వహించారు. పాలకోడేరు పీహెచ్‌సీ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ సుజన మాట్లాడుతూ సైక్లింగ్ ద్వారా బీపీని, గుండె జబ్బులను ఒత్తిడి, క్యాన్సర్ వంటివి ధరిచేరవని చెప్పారు. విస్సాకోడేరు హైస్కూల్ నుంచి విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నందమిల్లిపాడులో చురుగ్గా పైప్‌లైన్ల ఏర్పాటు



నందమిల్లిపాడులో పైప్‌లైన్ ఏర్పాటుచేస్తున్న దృశ్యం

ఆకివీడు: ఇంటింటికీ పైప్‌లైన్ సౌకర్యాన్ని మండలంలోని సిద్దాపురం గ్రామంలో మొట్టమొదటిసారిగా అమలు చేస్తున్నట్టు గ్రామ సర్పంచ్ ఎస్.చిట్టిబాబు, ఉపసర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు తెలిపారు. సిద్దాపురం గ్రామ శివారు నందమిల్లిపాడులో ప్రతి వీధిలోనూ పైప్‌లైన్ల ఏర్పాటు చేస్తున్నామని, జలజీవన్ మిషన్ ద్వారా 880 మీటర్ల మేర పైప్‌లైన్ విస్తరణకు, ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి రూ.23 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీని అమలుజేస్తున్నందుకు సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ధన్యవాదాలు తెలిపారు. నందమిల్లిపాడులో పైప్‌లైన్ల ఏర్పాటు దాదాపుగా పూర్తయిందన్నారు. ప్రభుత్వం పైప్‌లైన్‌తో పాటు ఇంటికి కనెక్షన్ ఇచ్చేందుకు అవసరమైన మెటీరియల్ ఉచితంగా ఇస్తుందని చెప్పారు. ప్రజలు పంచాయతీ బైలా ప్రకారం డిపాజిట్ చెల్లించి, పైప్‌కనెక్షన్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మూల చిట్టిబాబు, చింతాడ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ భోగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఎస్సై రామచంద్రరావును సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: అంకితభావంతో పనిచేస్తే ఏ ఉద్యోగి అయినా గుర్తింపు లభిస్తుందని భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో భీమవరం డీఎస్ఆర్‌బీకి బదిలీ అయిన పాలకోడేరు ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావుకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రామచంద్రరావు బాధ్యతలను సక్రమంగా నెరవేర్చారని కొనియాడారు. తమను రామచంద్రరావు ఎంతో గౌరవంగా చూసుకునేవారని పలువురు సిబ్బంది గుర్తుచేసుకునానరు. కొత్తగా పదవీ బాధ్యతలను స్వీకరించిన ఎస్సై నాళం శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్సై డీవీవీ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ ధనుంజయ్, చందర్రావు, శంకర్, తేజ మహేంద్ర, బాలకృష్ణ రామకృష్ణ, మహిళా పోలీసులు కొనాల బేబీ, బొక్కా నాగలక్ష్మి, అనూష, పూర్ణిమ, భవాని సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



దుకాణంలో ఎరువులకు సంబంధించి దస్త్రాలు పరిశీలిస్తున్న ఏడీఏ ఎ. పార్వతి

భీమవరం అర్బన్: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని పాలకొల్లు ఏడీఏ ఎ. పార్వతి హెచ్చరించారు. భీమవరం పట్టణం, మండలంలోని ఎరువులు దుకాణాల్లో బుధవారం ఏడీఏ ఎ. పార్వతి తనిఖీలు నిర్వహించారు. ఎరువులకు సంబంధించి దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ పార్వతి మాట్లాడుతూ దాళ్వా సాగుకు సంబంధించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలు దుకాణాలు తనిఖీలు చేసి రూ. లక్షకు సంబంధించి ఎరువులకు దస్త్రాలు సరిగ్గా లేకపోవడతో వాటి విక్రయాలను నిలుపుదల చేశారు. ఏడీఏ ఎ. పార్వతి వెంట మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాతృ భాష దినోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



మాతృ భాష దినోత్సవ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఈనెల 17 నుంచి 21 తేదీ వరకు ప్రపంచ మాతృ భాష దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ రంగసాయి తెలిపారు. స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో బుధవారం దినోత్సవ వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. గన్నాబత్తుల తులసమ్మ పెదతాత ట్రస్ట్ సౌజన్యంతో పట్టణ సాహితీ సంస్థల పాఠశాలు, కళాశాల సహకారంతో నిర్వహిస్తున్నామని, 17న జీటీపీ మహిళా కళాశాలలో వేడుకలను ప్రారంభిస్తామని, పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు తెలుగు భాషా ఔన్నత్యం తదితర అంశాలపై పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. 21న ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు కలిగొట్ల గోపాల శర్మ, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఏవీ గంగాధర్, నాచు శ్రీవల్లి, ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణపై ఫిర్యాదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ద్విచక్ర వాహనం గుర్తు తెలియని దొంగలు దొంగిలించారంటూ వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం డేగాపురానికి చెందిన తిరుమాని శ్రీనివాస్ వర్మ ఈ నెల 9న రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు ఉంచారు. తెల్లవారు జామును చూడగా వాహనం లేకపోవడంతో గుర్తు తెలియని దొంగలు దొంగిలించారంటూ తిరుమాని శ్రీనివాస్ వర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మోహన్‌రావు తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని పట్ల యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించడంపై ఫిర్యాదు అందిందని ఎస్సై పి.అప్పారావు బుధవారం తెలిపారు. మంగళవారం విద్యార్థిని వెంటపడిన యువకుడు ఆమె చేయి పట్టుకుని అల్లరి చేశాడని, ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్సై తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి



దిరుసుమర్రులో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసరావు

భీమవరం అర్బన్: సూర్యమిత్ర ఎగ్జిమ్ ఆక్వా ప్రోసెసింగ్ పరిశ్రమలో తొలగించిన డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్‌తో ఆందోళనను ఉధృతం చేస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసరావు హెచ్చరించారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రులో సూర్యమిత్ర ఎగ్జిమ్ ఆక్వా ప్రోసెసింగ్ పరిశ్రమ వద్ద మూడు రోజులుగా డ్రైవర్లు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు బుధవారం సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 15 ఏళ్లగా పరిశ్రమలో డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. రొయ్యలను చెన్నై, విశాఖపట్టణం పోర్టులకు కంటైనర్ల ద్వారా తరలిస్తూ నెలలో 20 రోజులు వారు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. డ్రైవర్లకు ట్రిప్పులకు ఇచ్చే బేటాలను తగ్గించారని అడిగినందుకు డ్రైవర్లను తొలగించడం దారుణమన్నారు. యాజమాన్యం డ్రైవర్ల పట్ల మొండి వైఖరి వీడనాడి వారిని విధుల్లోకి తీసుకుని పాత పద్ధతినే బేటాలను ఇవ్వాలని లేకుంటే జిల్లా స్థాయిలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షలో వి. శ్రీనివాస్, సీహెచ్ రామకృష్ణ, కె. సురేష్, పంపన కోటేశ్వర్లు, మూర్తి, పెద్దిరాజు, శివ పాల్గొన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు

ఆకివీడు : మహాశివరాత్రి మహోత్సవాలు ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక జవహర్‌పేట రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి, శని త్రయోదశి సందర్భంగా ఈనెల 18న అభిషేకాలు, వేద పండితులచే మహన్యాస మంత్ర పఠనం, లక్ష రుద్రాక్షలను ఏకలింగంగా తయారు చేసి 1008 కలశాలతో 1000 లీటర్ల ఆవుపాలు, సుగంధ ద్రవ్యాలను కన్యలు, సువాసినీలతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం ఖద్యోత (శనైశ్చర) పాశుపత అభిషేకం నిర్వహిస్తారు. పుట్టమన్ను, పాదరసంతో తయారు చేసిన పార్థివ లింగానికి రుద్రానువాకార్చన పూర్వక అభిషేకాలు చేస్తారు. ఈ అభిషేకం వల్ల శని దోషాలు పోతాయని, శని బాధలు నివృత్తి అవుతాయని ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొంట్లా గణపతి, కాకర్ల రాజరాజేశ్వరి తెలిపారు. కాదశ రుద్ర సహిత శివ లింగం, లక్ష రుద్రాక్షలతో ఏక లింగం, పార్థివ లింగాలకు స్వయంగా అభిషేకాలు చేసుకునే అవకాశం భక్తులకు కల్పించామన్నారు. మహా శివరాత్రి రోజు భారీ అన్నదాన ఉంటుందని చెప్పారు.

- భీమేశ్వరస్వామి, పిల్లల మర్రి అగ్రహారం వేంకట లింగేశ్వరస్వామి, సాలిపేట శివాలయం, అగస్తేశ్వర స్వామి, మాదివాడ మల్లేశ్వరస్వామి, అయిభీమవరం అమృతలింగేశ్వరస్వామి, కోళ్లపర్రు విశ్వేశ్వరస్వామి, కాళింగగూడెం శివాలయం, కుప్పనపూడి, పెదకాపవరం శివాలయాల్లో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి

పాలకోడేరు: చిన్నారులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో విస్సాకోడేరు సెయింట్ జాన్స్‌ఇంగ్లీష్ మీడియం స్కూల్ ముందంజలో ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వీ రమణ అన్నారు. బుధవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటుచేసిన 22 వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డీవైఈఓ శ్రీరామ్ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గొట్టుముక్కల శివాజీ రాజు, బొల్లా శ్రీనివాస్, చిల్లా అనూష సత్యనారాయణ, స్కూల్ ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ డియర్ స్వర్ణలత, గ్రామస్తులు పాల్గొన్నారు

పాఠశాలలోనే భోజనం చేయాలి

పాలకొల్లు అర్బన్: ప్రతీ విద్యార్థి పాఠశాలలోనే భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని మధ్యాహ్న భోజనం జిల్లా కోఆర్డినేటర్ కె కృష్ణారావు కోరారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల జెడ్పీ ఉన్నత పాఠశాల, దగ్గులూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకాన్ని కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. నూటికి నూరుశాతం విద్యార్థులు భోజనం చేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతీ రోజు మెనూ ప్రకారం వంట చేయాలన్నారు. అలాగే రుచికరంగా భోజనం తయారు చేయాలని నిర్వాహకులను కోరారు. మెనూ ప్రకారం విజిటబుల్ పలావు, బంగాళా దుంప కుర్మా కూర, కోడిగుడ్లు, చిక్కీలు అందజేశారన్నారు. పరిశీలించిన రెండు పాఠశాలల్లో నూరు శాతం మధ్యాహ్నం భోజనం చేయడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శివదేవునిచిక్కాల హైస్కూల్ విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం రికార్డులు పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిశీలించి ఆయాకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, ఎస్.మహాలక్ష్మి, సీఆర్‌పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు.